మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

## చిరకాల ప్రత్యర్థితో పోరు..

**ఈసారి ఆ లెక్క సరి చేస్తారా..?**



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

23.2.2025 ఆదివారం Sunday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 312 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar



03

## కులగణనతో బీసీల భవిష్యత్ అంధకారం

కాంగ్రెస్ తీరుపై కిషన్ రెడ్డి ఫైర్

## మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువులు

మొత్తం 14,236 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం 02





02

## ఏపీకి ఇద్దరు ఐపీఎస్ అధికారులు

అంజనీకుమార్, అభిలాష్ బిస్త్ రిలీవ్

# వ్యతిరేకిస్తున్న వారిని వదిలేది లేదు!

## బీసీ కులగణన సాహసోపేత నిర్ణయం..



**వందేళ్లలో జరగనిది 100శాతం సరైన లెక్కలు తేల్చాం**
**త్రికరణ శుద్ధిగా లెక్క తేల్చాం**

**రాహుల్ గాంధీ ఆదేశాలే నేను పాటించా**

- తప్పుడు లెక్క అనేవారిది తప్పుడు మాట.
- లెక్కతేలితే నష్టపోయే శక్తులే వ్యతిరేకిస్తున్నాయి
- తప్పుడు లెక్కలు అని ముద్రవేసి బీసీలకు చారిత్రక ద్రోహం
- బీసీ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

బీసీ కుల గణన ఒక సాహసోపేత నిర్ణయమని, త్రికరణ శుద్ధిగా లెక్కతేల్చామని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. వందేళ్లలో జరగనిది తాము 100 శాతం సరైన లెక్కలు తేల్చామని, రాహుల్ గాంధీ ఆదేశాలే నేను పాటించానని అన్నారు. తప్పుడు లెక్క అనేవారిది తప్పుడు మాట అని, బీసీల లెక్కతేలితే నష్టపోయే రాజకీయ శక్తులే దీనిని వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు.

**హైదరాబాద్, జనతా న్యూస్:** తప్పుడు లెక్కలు అని ముద్రవేసి బీసీలకు చారిత్రక ద్రోహం చేసే కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ప్రజాభవన్‌లో బీసీ సంఘాల నేతలతో మాట్లాడారు. 'ఈ కుల గణన బీసీలకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆస్తి. ఈ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీలదే. రాజకీయ ప్రేరేపితానికి లోనైతే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. బీసీలు ఓన్ చేసుకోకపోతే ఈ లెక్కలు పట్టాలెక్కవు. కుట్రలను ఛేదించకపోతే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. మంచి చేసిన నన్నే రాళ్లతో కొడదామనుకుంటే, నష్టపోయేది బీసీలే. కుల గణన వ్యతిరేకిస్తున్న వాడిని వదిలేసి బీసీ లెక్కలు తేల్చిన మాపై ఆరోపణలు చేస్తే కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టే. ఈ లెక్కలకు చట్టబద్ధత కల్పిస్తాం. బీసీ మిత్రులకు నా విజ్ఞప్తి. మీ కోసం నేను నా శక్తి మేరకు సాహసం చేశా. దీనిని సొంతం చేసుకోవాల్సిన బాధ్యత మీదే' అని చెప్పారు. బీసీ కులగణన సర్వే చేపట్టడం ద్వారా చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన విషయంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా

మిగతా 2 లో



## సీఎం రేవంత్ సవాల్‌కు రెడీ

- డేట్, టైం ఫిక్స్‌చేయండి
- గ్యారంటీలు, కమిషన్‌పై చర్చిద్దాం రండి
- కేటీఆర్.. నువ్వెంత నీ బతుకెంత!
- నీ చిట్టా అంతా నా దగ్గరుంది
- కేంద్ర మంత్రి బండి సంజయ్

03

## దమ్ముంటే ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చ చేద్దాం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సవాల్



కాంగ్రెస్ ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. తెలంగాణ ఆర్థిక స్థితిపై అసెంబ్లీలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. సభ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు సీఎం రేవంత్ బట్టలు విప్పుతామని హెచ్చరించారు.



## ఆ ప్రక్రియ స్టార్టయింది

అందరినీ ఢిల్లీకి తీసుకెళ్తాం
మార్చి మొదటి వారంలో చట్టం చేస్తాం
తెలంగాణ బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం

02



## నల్గొండలో బర్డ్‌ఫ్లూ కలకలం

- 7 వేల కోళ్లు పాతిపెట్టిన వైనం..

**నల్లగొండ, జనతా న్యూస్:** నల్గొండ జిల్లా కేతపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో బర్డ్ ఫ్లూ భయాందోళనకు గురిచేసింది. గ్రామంలోని రైతులు తాము నష్టపోయిన

మిగతా 2 లో




## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం

**ఎనిమిది మంది గల్లంతు**

- గల్లంతైన వారిలో ఇద్దరు అమెరికన్లు?
- ముమ్మరంగా సహాయక చర్యలు..
- సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- కార్మికులను కాపాడేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్

02

శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో ప్రమాదం చోటు చేసుకుంది. నాగర్ కర్నూలు వద్ద సొరంగంలో ఏర్పాటు చేసిన రింగ్‌లు కిందపడటంతో పైకప్పు కూలి సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వీరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటనా స్థలికి చేరుకుని సహాయకచర్యలు పర్యవేక్షిస్తున్నారు.

## ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

- సీఎంకు ఫోన్ చేసి తెలుసుకున్న మోడీ





# వ్యతిరేకిస్తున్న వారిని వదిలేది లేదు!

మొదటి పేజీ తరువాయి

నిలుస్తుందన్నారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన అవకాశం ఇదని, దీనిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలన్నారు. కేవలం అంతా సిఎం రేవంత్ చూసుకుంటారని అనుకుంటే కుదరదని అన్నారు. ప్రతి ఒక్కరూ కులాల వారీగా మీటింగ్‌లు పెట్టి ప్రజలకు వివరించాలన్నారు. దాదాపు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని.. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్రమైన కులగణన చేపట్టామన్నారు. ఈ మేరకు బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బీసీ సంఘాల నేతలతో ఆయన మాట్లాడారు. విపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ పూర్తి పారదర్శకంగా సర్వే చేపట్టాం. అధికారిక కార్యచరణకు అధికార బృందాన్ని వేశాం. బిహార్, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాం. కులగణనలో మూడు రోజుల పాటు ఇళ్ల వివరాలు సేకరించాం. ఇందుకోసం ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారులను నియమించాం. మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించాం. 36 వేల మంది డేటా ఆపరేటర్లను అదనంగా నియమించాం. ఎన్‌రోలర్‌గా సమాచారం సేకరించిన వారే డేటా ఎంట్రీ చేశారు. దాదాపు కోటి 12 లక్షలకుపైగా కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నాయని వివరించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి కులగణన ప్రయత్నమే చేయలేదు. న్యాయపరంగా, చట్టపరంగా నిబంధనలకు లోబడి చేశాం. 96.9 శాతం జరిగింది... 3.1 శాతం సర్వే రాలేదు. ఇంత పారదర్శకంగా కులగణన చేపడుతున్నా కొంత మంది నాయకులు ఇంకా చేయించుకోలేదు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 4 విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 5 కేటగిరీలున్నాయి. ముస్లింలలో ఓబీసీలను నాడు కేసీఆర్ ప్రభుత్వం విడిగా చెప్పలేదన్నారు. గుజరాత్‌లో కూడా ఓబీసీ ముస్లింలు ఉన్నారని ప్రధాని చెప్పారు. బీసీల లెక్క తేలితే మాకేంటి.. అని ఆ వర్గం అడుగుతారని భాజపా, భారాస భయపడుతోంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ ప్రధాని అయితే.. అన్ని



రాష్ట్రాల్లో కులగణన జరిగి తీరుతుంది. కులగణనను కాపాడుకోకపోతే.. బీసీలే నష్టపోతారు. ఇంత పకడ్బందీగా సర్వే చేసిన రాష్ట్రం ఇకపై కూడా మరొకటి ఉండదని సీఎం అన్నారు. నివేదిక ఆధారంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సూచనలు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలను కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యాచరణపై సూచనలివ్వాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు. ప్రతిపక్షాలు మొండిగా..తొండిగా వాదిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడక అని అందుకు సర్వే వివరాలు బయటపెట్టలేదన్నారు. కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం బీసీలు తగ్గారు..ఓసీలు పెరిగారని చెప్పారు. కాకి లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు రేవంత్. కులగణన సర్వే తెలంగాణ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ నిలుస్తోందన్నారు . దేశమంతా కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ భయపడుతోందన్నారు. కులగణన నూటికి నూరు శాతం పక్కా అని సీఎం రేవంత్ అన్నారు.కులగణన చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. బీసీ సంఘాలతో భేటీ అయిన రేవంత్ రెడ్డి.. కులగణనలో తెలంగాణ దేశంలోనే రోల్ మోడల్ గా నిలువబోతుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. సర్వే తప్పు అయితే..ఎట్ల తప్పో చూపించాలని బీజేపీ, బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. కుట్రలో భాగంగానే బీజేపీ, బీఆర్ఎస్ కులగణన సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కులగణన లెక్కలు తప్పు కాదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కులాల వారీగా సమావేశాలు నిర్వహించి కులగణన లెక్క పక్కా అని మార్చి 10 లోగా తీర్మానం చేయాలని సూచించారు. ఇకపోతే బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఫైరయ్యారు. పార్టీ నేతలకు ముఖ్యమంత్రి క్లాస్ పీకారు. నేను చేసేది చేసినా.. ఇక మీ ఇష్టం అని నేతలకు సూచించారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన ఆస్తి సర్వే.. కర్ర పట్టుకుని కాపాడుకుంటారో లేదో మీ ఇష్టం అని అన్నారు. సర్వే చేసినా నన్ను తిడుతున్నారు.. సర్వేలో కూడా పాల్గొనని వాళ్ళను మంచోడు అంటున్నారని తెలిపారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ ఇంటి ముందు డప్పు కొట్టండి.. బలహీన వర్గాల నేతలు కులాల వారిగా సమావేశాలు పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీసీల కోసం సర్వే చేసిన అని తనకు గర్వంగా ఉందని తెలిపారు. తాను తల ఎత్తుకుని తిరిగే పని చేశానన్నారు.. సర్వే బలహీన వర్గాల భావోద్వేగం.. మీరు కలిసి రండి అని అన్నారు. మిగిలిన విషయాల్లో విభేదించినా ఇబ్బంది లేదు.. కానీ కుల గణన విషయంలో మాత్రం తనకు సహకరించండని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మార్చి 10 లోపు అన్ని సంఘాలతో మీటింగులు పెట్టి చెప్పండి.. ఈ లెక్కలు కాదు.. కూడదు అని అంటే జీవితంలో మళ్ళీ అవకాశం రాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నివేదికను అనాథ చేయకండి.. ఎవరి కులం వారు ఆ సంఘాల సమావేశం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. కేసీఆర్ సర్వే ఎంత గొప్పగా ఉందో ఎస్సీ, ఎస్టీ ఉప కులాల లెక్క చూస్తే అర్థం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సమగ్ర సర్వేలో ఎస్సీలలో 82 కులాలు అని చెప్పారు.. ఎస్సీ, ఎస్టీ ఉప కులాల సంఖ్య పెరిగింది.

సమగ్ర సర్వే అర్థం పర్థం లేని లెక్కలు. సిగ్గుతో బయట పెట్టలేదు. బీఆర్ఎస్, బీజేపీ కోర్టుకు వెళ్లి బీసీ కుల గణన ఆపాలని చూస్తున్నాయి. అందుకే లెక్క సరిగ్గా.. ఆధారాలతో సహా చేశాం. కంప్యూటర్ లోనే కాదు.. సర్వే చేసిన పేపర్ బండిల్ కూడా సిద్ధంగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం..





**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద ప్రమాదం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ఎస్ఎల్‌బీసీ ఎడవ-ంవైపు సొరంగం పనులు జరుగుతుండగా సుమారు 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం సంభవించింది. టన్నల్ బోర్ మెషిన్‌తో పని జరుగుతున్నప్పుడు సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు ఉన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలిన ఘటనలో లోపల చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో గల్లంతయిన వారిలో ఇద్దరు అమెరికన్లు కూడా ఉన్నారన్న దానిపై ఎలాంటి స్పష్టత రాలేదని మంత్రి వెల్లడించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ పనులు మొదలు పెట్టిన తర్వాత ఈ ప్రమాదం జరిగిందని ఉత్తమ్ తెలిపారు.

## ఆర్మీతో మాట్లాడాం

ఎస్ఎల్బీసీ ప్రమాదంపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. కూలిన టన్నెల్ పూర్తిగా బ్లాక్ అయిపోయిందని మంత్రి తెలిపారు. టన్నెల్ కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు గల్లంతయ్యారని వెల్లడించారు. వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉత్తమ్ వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పిస్తున్నామని.. భారత సైన్యంతో కూడా మాట్లాడామని ఆయన తెలిపారు.

## కేంద్రమంత్రి ఆరా

ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరాతీశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. టన్నెల్లో చిక్కుకున్న వారిని వీలైనంత త్వరగా బయటకు తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

## బీఆర్ఎస్ ఆగ్రహం

ప్రమాదంపై కేటీఆర్, హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ అసమర్థతకు, చేతగానితనానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్ మండిపడ్డారు.

# ఆ ప్రక్రియ స్టార్టయింది..

- అందరినీ ఢిల్లీకి తీసుకెళ్తాం
- మార్చి మొదటి వారంలో చట్టం చేస్తాం
- తెలంగాణ బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించే పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వచ్చే మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి, చట్టాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో 96.9? మంది పాల్గొన్నారని, కేవలం 3.1? మంది మాత్రమే అందులో పాల్గొనలేదని వివరించారు. ఈ క్రమంలో, రెండో విడత కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ హక్కులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువులు

## మొత్తం 14,236 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర మొదలైంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్ మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

# నల్గొండలో బర్డ్‌ఫ్లూ కలకలం

విషయాన్ని తెలియజేస్తూ, ప్రభుత్వ సహాయం కోరుతున్నారు. చెరుకుపల్లి గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో గత కొన్ని రోజులుగా కోళ్లు అనారోగ్యానికి గురవుతుండగా, ఈ సమస్య మరింత తీవ్రమై సుమారు 7,000 కోళ్లు ఆకస్మికంగా మరణించాయి. ఈ ఘటనతో గ్రామస్తుల మధ్య భయాందోళనలు వ్యక్తమయ్యాయి. బర్డ్ ఫ్లూ సోకినట్టుగా అనుమానం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రైతులు తక్షణమే స్పందించి, చనిపోయిన కోళ్లను జేసీబీ సహాయంతో పూడ్చిపెట్టారు. కోళ్లు అనారోగ్యానికి గురవుతున్న విషయాన్ని గమనించిన వెంటనే రైతులు హైదరాబాద్ నుంచి నిపుణులైన వెటర్నరీ డాక్టర్లను రప్పించారు. అయితే, పలు మార్లు వైద్యం అందించినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు. రైతులు తమ కోళ్లను రక్షించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ, అనారోగ్యం మరింత తీవ్రమై కోళ్ల మరణాన్ని తలపెట్టింది.

# ఏపీకి ఇద్దరు ఐపీఎస్ అధికారులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష్ బిస్త్‌ను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఏపీలో చేరేందుకు వీలుగా వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. కరీంనగర్‌లో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఈసీని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. రహదారి భద్రత అథారిటీ ఛైర్మన్ అంజనీకుమార్(1990), తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్(1994), కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి(2011)లు ఏపీకి వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)... రెండు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించడం.. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు జరిగాయి. చివరకు 2024లో నియమించిన ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు ఇప్పుడు ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

# లిఫ్ట్‌లో ఇరుక్కుని చికిత్స పొందుతున్న బాలుడు మృతి

## కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు..



**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ లిఫ్టులో ఇరుక్కుపోయిన బాలుడు మృతి చెందాడు. శుక్రవారం అపార్ట్‌మెంట్ లిఫ్టుకి, గోడకి మధ్య ఇరుక్కుపోయి.. రెండున్నర గంటలపాటు నరకయాతన అనుభవించిన ఆరేళ్ల బాలుడిని బయటకు తీసి నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోయాడు. ఆగాపుర గోడేకిఖబర్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ కుమారుడు అర్ణవ్(6).. శుక్రవారం మధ్యాహ్నం తాతతో కలిసి రెడ్‌హిల్స్ శాంతినగర్ పార్కు ఎదురుగా ఉన్న మఫర్ కంఫర్ట్ అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులో నివసిస్తున్న మేనత్త వద్దకు వెళ్లాడు. తాత చేతిలో లగేజీ ఉండటంతో బాలుడు చొరవ తీసుకుని లిఫ్టు గ్రిల్స్ తెరిచి ముందుగా లోపలికి వెళ్లాడు. తాత లగేజీ పెట్టేలోపే లిఫ్టు ఒక్కసారిగా పైకి వెళుతుండటంతో భయంతో బయటికి వచ్చేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో లిఫ్టుకు, గోడకు మధ్యలో బాలుడు ఇరుక్కుపోగా..కదిలే వీల్లేని పరిస్థితుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌కు, మొదటి అంతస్తుకు మధ్య లిఫ్టు ఆగిపోయింది. అర్ణవ్ హాహాకారాలు, మనవడిని రక్షించండంటూ తాత వేసిన కేకలతో అపార్ట్‌మెంట్‌వాసులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ హుటాహుటిన అక్కడికి చేరుకోవడంతోపాటు డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలను, 108 అంబులెన్స్‌ను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. తొలుత గ్యాస్‌కటర్‌తో లిఫ్టు గ్రిల్స్‌ను తొలగించే ప్రయత్నం చేసినా.. బాలుడి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చివరికి లిఫ్టు గోడలను బద్దలుకొట్టారు. దాదాపు 90 నిమిషాలు శ్రమించి అతికష్టమ్మీద బాలుడిని బయటికి తీశారు. నడుము, కడుపు భాగానికి తీవ్ర గాయాలై.. అపస్మారకస్థితికి చేరిన బాలుడికి 108 వైద్య బృందం ఆక్సిజన్ అందించి..అనంతరం నిలోఫర్ ఆసుపత్రికి తరలించింది. ఐసీయూలో చికిత్స పొందుతూ బాలుడు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బాలుడిని బతికించేందుకు తీవ్రంగా శ్రమించినట్లు వైద్య బృందం తెలిపింది. మధ్యాహ్నం 12.30 గంటలకు బాలుడు మృతి చెందినట్లు వెల్లడించింది. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. రోదనలు మిన్నంటాయి. అపార్ట్‌మెంట్ వాసులు కూడా తీవ్రం కలత చెందారు.

# కులగణనతో బీసీల భవిష్యత్ అంధకారం

**నిజామాబాద్, ఫిబ్రవరి 22:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు . శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల రానున్న కాలంలో బీసీల భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనపై తమతో చర్చకు వస్తామని కాంగ్రెస్ చెప్పడం హాస్యస్పదంగా ఉందని పేర్కొన్నారు. తాము చర్చలకు సిద్ధంగానే ఉన్నామని, దానికి ముందు వారు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన అనంతరం తమతో చర్చలకు రావాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి



రాక ముందు వంద రోజుల్లో వాగ్దానాలు పూరి చేస్తామని మాటిచ్చిన కాంగ్రెస్, 400 రోజులు గడుస్తున్న వారిచ్చిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కంటున్న కలలు నీరుగారి పోతున్నాయని, దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. అందుకు ఢిల్లీ ఎన్నికలే నిదర్శనమని కేంద్రమంత్రి అన్నారు. రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ ప్లలె గంగారెడ్డి, ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి



- యాక్సిడెంటల్ సిఎం అంటూ విమర్శలు
- దమ్ముంటే ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చ చేద్దాం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సవాల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** కాంగ్రెస్ ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్దమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. తెలంగాణ ఆర్థిక స్థితిపై అసెంబ్లీలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. సభ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు సీఎం రేవంత్ బట్టలు విప్పుతామని హెచ్చరించారు. పాలన చేతకాని సన్యాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్.. అచ్చోసిన ఆంబోతు మాదిరి రంకెలు వేయటం మానుకోవాలన్నారు. సొంత రాష్ట్రాన్ని క్యాన్సర్‌తో పోల్చిన భావదారిద్య్రపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటీశ్వరులైన మహిళలను మాత్రమే రేవంత్ ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ దివాలా తీసిందని.. గత 15 నెలలుగా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి తెలంగాణ పరువును గంగలో కలుపుతున్నారన్నారు. కాళేశ్వరంపై కొంతమంది సన్యాసులు చెత్తవాగుడు బంద్ చేయాలని అన్నారు. తెలంగాణ ఆర్థికస్థితిపై ఫిబ్రవరి 17న డిప్యూటీ సీఎం భట్టి విడుదల చేసిన సమగ్రమైన నివేదికను రేవంత్ చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు చెప్పిన ఉప ముఖ్యమంత్రి భట్టికి ధన్యవాదాలు తెలియజేశారు. సంపద సృష్టించటంలో కేసీఆర్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందన్నారు. రేవంత్ రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేశారు. సిగ్గు.. మానం లేని మూర్ఖపు ముఖ్యమంత్రి అని విమర్శించారు. కేసీఆర్‌ను దూషించటం మానుకోకుంటే రేవంత్ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పాపం భట్టి విక్రమార్క అమాయకంగా ఇరుక్కున్నారని.. ఆయన ఉద్యోగం ఉంటదో.. పోతుందో? అని అనుమానం వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీ.. రేవంత్ 6వేల 500 కోట్లు అంటున్నారని.. భట్టి 2 వేల 200 కోట్లు అంటున్నారని తెలిపారు. ఢిల్లీ పార్టీలకు తెలంగాణను పరిపాలించుట చేదకాదని తేలిందన్నారు. కేంద్రం ఇచ్చే దానికంటే.. కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ ఇచ్చేది ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా.. అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రాతో రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. నీళ్ళు ఇచ్చుడు చేతకాకుంటే క్రాప్ హాలిడే ప్రకటించాలని మాజీమంత్రి డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కూడా కేటీఆర్గ ÷ర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలబడుతున్నారన్నారు. రేవంత్, సంజయ్‌లు.. ఆర్ఎస్ బ్రదర్స్ అని మార్కెట్‌లో చెప్పుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బిల్డర్స్ దగ్గర స్క్వేర్ ఫీట్‌కు రేవంత్ రెడ్డి.. 150 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. రాహుల్, మోదీ కులంతో ప్రజలకు ఏంటి లాభం అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ప్రాజెక్టు కుంగితే.. మేఘా కృష్ణారెడ్డిని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కృష్ణజాలల దోపిడీ విషయంలో అసెంబ్లీలో ఎండగడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.




# సీఎం సవాల్‌కు రెడీ

- డేట్, టైం ఫిక్స్‌చేయండి.. గ్యారంటీలు, కమిషన్‌పై చర్చిద్దాం
- కేటీఆర్.. నువ్వెంత నీ బతుకెంత! • నీ చిట్టా నా దగ్గరుంది
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరిస్తున్నామని, డేట్, టైం, వేదిక ఫిక్స్ చేయాలని కోరుతున్నామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు ఎవరి పేరును ప్రతిపాదిస్తే... వారు సీఎంతో చర్చకు సిద్ధంగా ఉన్నారన్నారు. 14 నెలల రేవంత్ రెడ్డి పాలనపై, 10 ఏళ్ల కేసీఆర్ పై, మోదీ పాలనపై ఎవరేం చేశారో? గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా లెక్కలతో వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని చ ఎప్పారు. అంతేకాదు 6 గ్యారంటీలతో కాంగ్రెస్ చేసిన మోసాలను, అవినీతి, అక్రమాలను, 15 శాతం కమీషన్ వివరాలపైనా బహిరంగ చర్చకు సిద్ధమని, సీఎంకు దమ్ముంటే చర్చ జరపాలని ప్రతి సవాల్‌విసిరారు.

### కేటీఆర్.. నువ్వెంత నీ బతుకెంత!

కేటీఆర్.. నోరు హద్దులో ఉంచి మాట్లాడాలని బండి సంజయ్‌ఫైర్‌అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలిచారని, వీరిద్దరూ ఆర్ఎస్ బ్రదర్సేనంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో స్పందించారు. 'నువ్వెంత నీ బతుకెంత..

నీ చిట్టా అంతా నా దగ్గరుంది.. సవాల్ చేస్తే బండారమంతా బయటపెడతా'.. హెచ్చరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులే దొరకక ఎన్నికల బరి నుండి పారిపోయినోడు కేటీఆర్ అని, కాంగ్రెస్ కు లోపాయికారీ సపోర్ట్ చేస్తున్నది మీరేనని, అందుకే కాళేశ్వరంలో, ఫోన్ ట్యాపింగ్, బామ్మర్ది ఫాంహౌజ్ లో డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేసు స్కాంలో కచ్చితమైన ఆధారాలున్నా మిమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదంటే నిజమైన కేఆర్ బ్రదర్స్ (కేటీఆర్, రేవంత్ రెడ్డి) మీరేనని చెప్పారు. 'నీ దొంగ నాటకాలు బంద్ చేయ్. నీది బిచ్చపు బతుకు. ఇంకా నీ అహంకారం పోలే. నీ బతుకంతా నా దగ్గర ఉంది. పర్సనల్ గా పోవద్దని నేను ఆగుతున్నా. సవాల్ చేస్తే అవన్నీ బయటపెడతా. నాపై లీగల్ నోటీసు ఇచ్చి పారిపోయిన పరికిపందవు నువ్వు. కేసీఆర్ లేకపోతే నిన్ను కుక్కలు కూడా దేకవు. కేసీఆర్ అనేటోడు లేకపోతే నిన్ను రాళ్లతో కొడతారు. అమెరికాలో చిప్పలు కడిగినోడివి. తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతుంటే ఇక్కడికి వచ్చి ఉద్యమం పేరు చెప్పి టిక్కెట్లు దండుకున్నోడివి. అయ్యపేరు చెప్పి బతుకతలే'.. అని మండిపడ్డారు.

### సొరంగం ఘటనపై దిగ్భ్రాంతి

ఎస్ఎల్ బీసీ సొరంగం పైకప్పు కూలిన దుర్ఘటనపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన సాయం అందించాలని కోరారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు.

# సొరంగ ప్రమాదానికి బాధ్యత రేవంత్‌దే

- రక్షణ చర్యలు లేకుండా పనులు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్
- ప్రభుత్వ వైఫల్యమన్న హరీష్ రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గుత్తేదార్లతో కుమ్మక్కై, కమీషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.




# నిజామాబాద్ పసుపు యార్డు సందర్శన

### రైతులు దారుణంగా మోసపోతున్నారు: కవిత

నిజామాబాద్, ఫిబ్రవరి 22: నిజామాబాద్ పసుపు యార్డు ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. నిజామాబాద్ పసుపు యార్డులో.. రైతులు దారుణంగా మోసపోతున్నారని, వారం రోజులుగా ధరలు పడిపోయాయన్నారు. కేంద్రం 15 వేలు మద్దతు ధర ఇస్తామని గొప్పలు చెప్పి రైతులను మోసం చేశారని, పసుపు బోర్డు కు చట్ట బద్ధత లేదన్నారు ఎమ్మెల్సీ కవిత. పార్లమెంట్ లో బిల్లు పెట్టి .. బిల్లు పాస్ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, పసుపు మార్కెట్ లో రైతులను బ్లాక్ మెయిల్ చేసే పరిస్థితి అని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి అని, పసుపు కు 12 వేలు ఇస్తామని గతంలో సీఎం రేవంత్ చెప్పారన్నారు. పసుపు రైతులకు బోనస్ ఇవ్వాలని, కేంద్రం పై పసుపు 15 వేలు ధర ఇవ్వాలని పోరాటం ఉంటుందన్నారు. పసుపు బోర్డుకు చట్ట బద్ధత కల్పించాలని బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు ఎమ్మెల్సీ కవిత.

# యూట్యూబ్ ఛానల్ ముసుగులో వ్యభిచారం



**విజయవాడ,ఫిబ్రవరి 22 :** విజయవాడలో యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహిస్తున్న బిల్డింగ్‌పై మాచవరం పోలీసులు దాడి చేశారు. వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డులో స్టూడియో 9 ( స్పా) సెంటర్‌పై సహచర సిబ్బందితో కలిసి మాచవరం సీఐ ప్రకాష్ దాడులు చేశారు. ఏపీ 23 యూట్యూబ్ ఛానల్ న్యూస్ బిల్డింగ్ నందు స్పా సెంటర్ నడుపుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు రైడ్ చేశారు. 10 మంది మహిళలు, 13 మంది విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్.. యూట్యూబ్ ఛానల్‌ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం భార్గవ్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# ఉన్నతాధికారి ఇంట్లో ముగ్గురు మృత్యువాత

- హత్యా..ఆత్మహత్యా అన్న అనుమానాలు
- దర్యాప్తు చేపట్టిన పోలీసు విభాగం

**తిరువనంతపురం, ఫిబ్రవరి 22:** కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతహోదాలో ఉన్న ఓ అధికారి ఇంట్లో మరణాలు మిస్టరీగా మారాయి. ఆయనతో పాటు తల్లి, సోదరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కేరళలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మనీశ్ విజయ్ కొచ్చిలో సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగంలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆఫీసుకు నాలుగు రోజులు సెలవులు పెట్టారు. అవి పూర్తయిన తర్వాత కూడా ఆయన తిరిగి విధుల్లోకి రాలేదు. దాంతో మనీశ్‌ను కలిసేందుకు స్నేహితులు ఎర్నాకుళం జిల్లాలోని అతని క్వార్టర్స్‌కు వెళ్లి చూశారు. కానీ అక్కడికి వెళ్లగానే దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు తీయగా మనీశ్ ఒక గదిలో, ఆయన సోదరి షాలిని మరో గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. వారి తల్లి వేరే గదిలో మంచంపై నిర్జీవంగా కనిపించింది. ఆ మృతదేహాన్ని తెల్లని వస్త్రంలో చుట్టి పూలు చల్లినట్లుగా ఉంది. పక్కనే వీరు ముగ్గురూ దిగిన ఫొటో ఉంది. దీంతో ఈ ఘటన అనుమానాలకు దారితీసింది. ఆమె ముందే చనిపోయి ఉండొచ్చని, లేకపోతే ముందే చంపేసి, వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే వారు మృతి చెందినట్లు కొచ్చి పోలీస్ కమిషనర్ మీడియాకు వెల్లడించారు. ఫోరెన్సిక్ పరీక్ష తర్వాత ఈ మరణాలకు గల కారణాలు తెలుస్తాయన్నారు. అలాగే ఒక గదిలో డైరీని గుర్తించారు. విదేశాల్లో ఉన్న సోదరికి తమ మరణం గురించి సమాచారం ఇవ్వాలని, ఇంట్లో ఉన్న అన్ని పత్రాలను ఆమెకు అందించాలని కేరళ పోలీసులను ఉద్దేశించి అందులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు బలపడుతున్నాయి. మనీశ్ కుటుంబం స్వరాష్ట్రం ఝార్ఖండ్. ఆయన గతంలో కోళికోడ్ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ విభాగంలో పనిచేశారు. తర్వాత సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగానికి బదిలీ అయ్యారు. కొద్దినెలల నుంచి ఆయనతో పాటు తల్లి, సోదరి కూడా ఉంటున్నారు. ఇక షాలిని ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో తొలిర్యాంకు సాధించారు. ఆ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసును సీబీఐ విచారిస్తోంది. ఈ కేసులో ఆమె నిందితురాలిగా ఉన్నారు. దీంతో మనస్తాపానికి గురై వీరి కుటుంబం ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల మనీశ్ లీవ్ పెట్టింది కూడా ఆ లీగల్ కేసు పనిమీదే అని తెలుస్తోంది. దీనిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

# పాక్ జైలు నుంచి 22మంది మత్స్యకారుల విడుదల

**లాహోర్, ఫిబ్రవరి 22:** పాకిస్థాన్ జైలు నుంచి 22 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. గతకొంతకాలంగా వీరు కరాచీ కారాగారంలో మగ్గుతున్నారు. వీరంతా అంతర్జాతీయ జలసంధిని దాటినందుకు అరెస్ట్ అయ్యారు. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి శుక్రవారం బయటకువచ్చారు. ఆ మత్స్యకారుల్ని భారత్‌కు అప్పగించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలో భారత జాలర్లకు ఈదీ ఫౌండేషన్ సహాయసహకారాలు అందించింది. వారు కరాచీ నుంచి లాహోర్‌కు వెళ్లడానికి కావాల్సిన రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసింది. అక్కడి నుంచి వారు భారత్‌కు రానున్నారు. ఆ సంస్థ మత్స్యకారులకు ప్రయాణఖర్చులు, కొన్ని బహుమతులు, నగదు అందించింది.



ఈ సందర్భంగా భారత్-పాక్ ప్రభుత్వాలకు ఈదీ ఫౌండేషన్ ఛైర్మన్ జైల్ ఈదీ ఒక అభ్యర్థన చేశారు. ఎలాంటి దురుద్దేశం లేకుండా పొరపాటున అంతర్జాతీయ జలాల సరిహద్దులు దాటుతున్న వారిపై దయతో వ్యవహరించాలని అభ్యర్థించారు. వాఘా సరిహద్దు ద్వారా పాక్ అధికారులు ఈ జాలర్లను భారత్‌కు అప్పగిస్తారు. అన్ని ప్రక్రియలు పూర్తిచేసిన తర్వాత మన అధికారులు వారిని స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లుచేస్తారు. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించక పోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే.. జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలు ఉన్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మన దేశ జాబితా పేర్కొంది. ఈ సందర్భంగా ఇరు దేశాలు ఈ విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.



# మన దేశ వ్యవహారాల్లో వేలు పెడుతున్నదెవరు?

స్వాతంత్ర్యానంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. ఇటీవల మళ్లీ అలాంటి కుయుక్తులు సాగుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. మనదేశ అంతర్గత వ్యవహారాల్లో బైడెన్ ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్లు వెల్లడయ్యింది. అది కూడా ఎన్నికల వ్యవహారంలో తలదూర్చి నిధులు కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడ ఓ విషయం గమనిస్తే.. కాంగ్రెస్ నేత రాహుల్ గతంలో అమెరికాలో పర్యటించారు. ఆయన అక్కడే ఉండి మనదేశ అంతర్గత వ్యవహారాలపై అనేకం మాట్లాడారు. ఆ తరవాతే ఆదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. ఇప్పుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈ రెంటికీ ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీటిని జాగ్రత్తగా గమనిస్తే అనుమానాలు ఉన్నట్లు రాజకీయ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే అంతర్గ వ్యవహారాల్లో దూరి దేశాన్ని అస్థిరపరచాలన్న చీప్ ట్రిక్స్ ఆడారా అన్నది మున్ముందు తేలనుంది. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్థిరపరచే చర్యలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాటి వారిపై కఠినంగా ఉండాల్సిందే. నిజానికి మనం ఏ దేశంలోనూ వేలుపెట్టే అవకాశం తెచ్చుకోం. ఇతరులు జోలికి వస్తే ఊరుకోం. ఏ దేశానికైనా పటిష్టమైన విదేశాంగ విధానం ఉండాలి. ప్రపంచ దేశాల్లో ఇదే ముఖ్యం. ఇతర దేశాలు కష్టసమయాల్లో ఉంటే ఆదుకోవాలి. అన్నార్తులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ముందునుంచీ మనం పాటిస్తున్నాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగేలా మన గత పాలకులు, ప్రస్తుత పాలకులు వ్యవహరిస్తున్నారు. గతంలో పాక్ మంత్రులు పలువురు ఇలాగే ప్రేలారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలో పాక్ ముందుంటుంది. ఇప్పుడు బంగ్లా తోడయ్యింది. బిబిసి కూడా అడపాదడపా తన కుట్రలను వెల్లడిస్తోంది. మొన్నటికి మొన్న మాజీ చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఇంటర్వ్యూలో కూడా బిబిసి అడిగిన ప్రశ్నలు దాని కుత్సిత స్వభావాన్ని బయటపెట్టాయి. ఆదానీ విషయంలో కూడా అమెరికా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను గర్హించాల్సిందే. దేశంలో మనం నిలదీయాల్సిన సమస్యల్లో విదేశీయులను తలదూర్చేలా చేయడం వల్ల అంతర్జాతీయంగా మనపరువును మనమే పోగొట్టుకున్న వారం అవుతాం. నిజానికిమోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణామాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం,ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం,ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లనయినా తిప్పికొట్టగలగాలి.

# బెంగళూరులో దారుణ ఘటన



- మహిళపై నలుగురు అత్యాచారం
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**బెంగళూరు, ఫిబ్రవరి 22:** బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోరమంగళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో 33 ఏళ్ల మహిళపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం జ్యోతి నివాస్ కాలేజీ జంక్షన్ వద్ద తాను వేచి ఉండగా.. దాదాపు 20 ఏళ్ల వయసు ఉన్న నలుగురు యువకులు వచ్చి తనతో మాటలు కలిపారని.. ఆ తర్వాత స్నేహంగా మెలిగి డిన్నర్‌కు ఆహ్వానించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. డిన్నర్ పూర్తయ్యాక ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. ఓ ప్రైవేటు హోటల్ టెర్రాస్‌పైకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించి.. శుక్రవారం ఉదయం 6గంటలకు విడిచిపెట్టారని పేర్కొన్నారు. ఉదయం ఇంటికి చేరుకున్నాక జరిగిన దారుణం గురించి భర్తకు వివరించగా.. పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ సారా ఫాతిమా మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 7.30 -8గంటల సమయంలో ఈ ఘటనపై తమకు సమాచారం అందిందన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను అరెస్టు చేసి.. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిపారు. అయితే, ఆ యువకులతో ఆమె ఎందుకు వెళ్లారనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దిల్లీకి చెందిన ఈ మహిళ తన భర్తతో బెంగళూరులో స్థిరపడ్డారని, ఆమె క్యాటరింగ్ సర్వీసెస్‌లో పనిచేస్తుందని పోలీసులు వివరించారు. నిందితులు తమ స్నేహితుడిని కలిసేందుకు అక్కడికి వెళ్లినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే, ఈ నలుగురికీ ఒకరితో మరొకరికి పరిచయం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా.. ఒకరు ఉత్తరాఖండ్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరంతా వివిధ హోటళ్లలో చెఫ్‌లు, వెయిటర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు.



# మారిషస్ స్వాతంత్యోత్సవాల అతిథిగా మోడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 : మారిషస్ స్వాతంత్యోత్సవ వేడుకల్లో ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఆహ్వానం అందింది. వచ్చే నెలలో జరిగే మారిషస్ 57వ స్వాతంత్య్ర దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా హాజరవుతారని మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గూలమ్ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు రాబోయే వేడుక సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత ప్రపంచ అధినేతల్లో మోదీ ఒకరని.. బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తమ ఆహ్వానాన్ని అంగీకరించడం గౌరవంగా భావిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. 1968 మార్చి 12న బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన మారిషస్‌కు స్వాతంత్య్రం దక్కింది. నాటినుంచి మారిషస్ ఏటా మార్చి 12ను నేషనల్ డేగా నిర్వహించుకుంటోంది. కాగా గతేడాది భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మారిషస్ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ మారిషస్ ఆమెకు గౌరవ డాక్టర్ ఆఫ్ సివిల్ లాను ప్రదానం చేసింది. ఇప్పుడు ప్రధాని మోడీ హజరవుతారు. ఈ రెండు దేశాల మధ్య పటిష్ట బందం ఉంది.

# ఫాల్కన్ ఇన్వాయిస్ కేసులో దర్యాప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో వేల మందిని మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేయడంతో విచారణ మరింత వేగవంతమైంది. హైదరాబాద్ హైటెక్ సిటీ హుడా ఎన్‌క్లేవ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించిన ఈ సంస్థ, ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో అధిక లాభాలను వాగ్దానం చేసి, రూ.1,700 కోట్ల మేర నిధులను సమీకరించింది. సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ నివేదిక ప్రకారం, ఈ సంస్థ నిర్వాహకులు దుబాయ్, మలేషియా సహా 14 షెల్ కంపెనీలకు రూ.850 కోట్లను మళ్లించినట్లు నిర్ధారణ అయ్యింది.



# కృష్ణా జలాలపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

## ఏపీకి క్షమాపణ చెప్పాలన్న బిజెపి నేత




**కర్నూలు, ఫిబ్రవరి 22 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణా జలాలను ఏపీ దోపిడీ చేస్తుందని రేవంత్‌రెడ్డి అనడం దారుణం అన్నారు. కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రజలను, రైతులను దోపిడీ దొంగలుగా చిత్రీకరించడం దారుణం అని.. ఒక సీఎంగా ఉండి ఇలా మాట్లాడడం సహేతుకమేనా అని నిలదీశారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ఎవరి త్యాగాలతో నిర్మించారో రేవంత్ రెడ్డికి తెలియదా అని అడిగారు. ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. ఏపీ తన కాళ్ల మీద నిలబడుతుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో ఒక్క స్కీమ్ కూడా అమలు చేసే పరిస్థితి లేదు. ఏపీ, తెలంగాణ మధ్య కావాలనే జల వివాదాలు సృష్టిస్తున్నారు. రేవంత్ రెడ్డి కపట నాటకం ఆడుతున్నారు. రేవంత్ రెడ్డి బేషరతుగా ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపుతారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. అందుకే రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారా?, అయినా దేశంలో కాంగ్రెస్ పని అయిపోయింది. దేశంలో 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతుందని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.

# కుంభమేళాకు కొనసాగుతున్న తాకిడి

## 60కోట్ల మంది వచ్చారని వెల్లడించిన యోగి

**లక్నో, ఫిబ్రవరి 22:** ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతోన్న కుంభమేళాకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తుతున్నారు. కుంభమేళా తుదిదశకు చేరుకోవడంతో రోజురోజుకు భక్తుల రాక పెరుగుతోంది. పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసేందుకు భారీగా తరలి వస్తున్నారు. ఈ క్రమంలో అయోధ్య, వారణాసిలను సందర్శించుకునేందుకు వెళ్లడంతో అక్కడా భక్తజనసందోహంగా మారింది. ఈ క్రమంలో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 22 మధ్య 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. మహాకుంభ్ శక్తిని యావత్ ప్రపంచం కీర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్ర సామర్థ్యం, అభివృద్ధిపై నమ్మకం లేనివారు కుంభమేళాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహాశివరాత్రి లోపు 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ముందు అనుకు న్నామని.. కానీ దానికి ముందే అంచనాలకు మించి ప్రజలు హాజరయ్యారని అన్నారు. ప్రతీ 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వరకు వస్తున్నారు. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం మరో నాలుగు రోజుల్లో ముగియనుండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. అలాగే యూపి ప్రభుత్వం ఎప్పటికప్పుడు భద్రతా చర్యలు తీసుకుంటోంది.





## నిర్దేశించిన బ్యాంకు లింకేజి రుణాలను సకాలములో అందించాలి:అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్



**సిద్దిపేట ,జనతా న్యూస్:** స్వయం సహాయక సంఘ సభ్యులందరికి నిర్దేశించిన బ్యాంకు లింకేజి రుణాలను సకాలములో అందించి ఉపాధులు పెంచాలని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారము సిద్ధిపేట కల్లెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి సెర్ప్ మరియు మెప్మా ఉద్యోగుల సమీక్ష సమావేశానికి హాజరై యస్.హెచ్.జి బ్యాంకు లింకేజి రుణాలను, ఇందిరా మహిళా శక్తి-ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లను, పాడి పశువుల కొనుగోలు యూనిట్స్ ను, యునిఫారం స్టిచింగ్ పై మండల స్థాయి ఎ.పి.యం, సి.సి లను రివ్యూ చేయడం జరిగింది.2024-25 ఆర్థిక సం,, లో రూ,, 895.61 కోట్ల యస్.హెచ్.జి బ్యాంకు లింకేజి రుణాలను అందించవలసి ఉండగా రూ,, 831.98 కోట్ల రుణాలను అందించడం జరిగిందని మిగిలిన రూ,, 63.62 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను మార్చ్,7 లోపు అందించి అన్ని మండలాలు 100% టార్గెట్ పూర్తి చేయాలనీ ఆదేశిస్తూ, మెప్మా ఉద్యోగులు కూడా తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని అలాగే యన్.పి.ఎ ఉన్న యస్.హెచ్.జి లకు యం.సి.పి లు చేయకూడదని తెలుపడం జరిగింది మరియు టి.జి.బి బ్యాంకు పరిధిలో చాలా కాలంగా యం.సి.పి లు పెండింగ్ ఉన్నందున సత్వర చర్యలు తీసుకోవలసినదిగా యల్.డి.యం గారికి సూచించడం జరిగింది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలలో ప్రత్యేక చొరవ చూపి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ గ్రౌన్డింగ్ జరిగేలా చూడాలని, పాడి పశువుల యూనిట్ ల గ్రౌన్డింగ్ ను వచ్చే సమీక్ష సమావేశము లోపు పూర్తి చేయాలని ఎ.పి.యం మరియు స్త్రీ నిధి స్టాఫ్ ను ఆదేశించడం జరిగింది. డి.ఆర్.డి.ఓ జయదేవ్ ఆర్య గారు మాట్లాడుతూ బ్యాంకు లింకేజి ను జిల్లా లో మొదరి వరుస లో ఉంచడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, బ్యాంకు లో సబ్మిట్ చేసిన ప్రతి యం.సి.పి సాంక్షన్ జరిగేల చూడాలని తెలిపారు. గత సంవత్సరం విద్యార్థులకు యునిఫార్మ్ సకాలములో అందించి ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుండి స్వయం సహాయక సంఘాలు మంచి పేరును పొందాయని, అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా సకాలములో విద్యార్థులకు స్కూల్ యునిఫార్మ్ స్తిచింగ్ చేసిన అందించడానికి తరగతుల వారిగా కొలతలు తీసుకొని రిపోర్ట్ అందిచాలని తెలిపినారు. ఈ కార్యక్రమములో యల్.డి.యం హరి బాబు గారు, పి.డి-డి.యం.సి కె,హనుమంత రెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి.ఓ టి.మధుసూదన్, డి.పి.యమ్స్, ఎ.పి.యమ్స్, సి.సి లు, టి.యం.సి లు తదితరులు పాల్గొన్నారు.

## రుక్మాపూర్ గురుకుల ప్రిన్సిపాల్ , ఆర్మీ డైరెక్టర్ ల ను తొలగించాలి

### గురుకులాల విద్యార్థుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మొగు రం రమేష్



కరీంనగర్,జనతా న్యూస్: తెలంగాణ రాష్ట్రంలోని చాలా ప్రతిష్టాత్మకంగా నడపబడుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక పాఠశాల/ కళాశాల లో విద్యార్థులు క్రమశిక్షణ తప్పి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం లాంటి సంఘటనలు చాలా బాధాకరం అని తెలంగాణ గురుకులాల విద్యార్థుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు మొగురం.రమేష్ అన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టలేని రుక్మాపూర్ గురుకుల సైనిక్ స్కూల్లో/ కళాశాల ప్రిన్సిపాల్ కాళహస్తి, ఆర్మీ డైరెక్టర్ కల్నల్ కే.సీ రావు లను విధుల్ల నుంచి తొలగించాలని ఆయన జిల్లా కలెక్టర్ ను కోరారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరం . అయితే సైనిక్ స్కూల్లో ప్రిన్సిపాల్, ఆర్మీ డైరెక్టర్ లు సరియైన విధానంలో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టకపోవడంతో ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులపై దాడి చేయడం చాలా బాధాకరం, ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర దర్యాప్తు జరిపి సంఘటనకు బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలను సైనిక్ స్కూల్ కు పంపిస్తే ఉపాధ్యాయుల అశ్రద్ధతో గురుకులా ల్లో ఇలాంటి సంఘటనలు జరగడం సరి కాదన్నారు. ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు

## భయం వదిలి పరీక్షలకు సిద్ధం కండి

### విద్యార్థులకు పరీక్షలపై సూచనలు చేసిన వ్యక్తిత్వ వికాస నిపుణులు.




జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో ఎల్లంపల్లి లోగల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షల భయాన్ని పోగొట్టడానికి, వారిలో మానసిక ధైర్యాన్ని నింపడానికి ప్రముఖ సైకాలజిస్ట్ లు సంపత్ కుమార్, రమాదేవి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలో విద్యార్థులకు వివరిస్తూ, భయాన్ని వదిలి పరీక్షల కోసం సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి సమావేశం



**కరీంనగర్,జనతా న్యూస్:** మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎన్నికలకు సంబంధించిన పలు వివరాలు వెల్లడించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. 394 మంది మైక్రో అబ్జర్వర్లు, 335 మంది జోనల్ అధికారులు, 2 వేల 606 మంది పోలింగ్ అధికారులు, 864 మంది ప్రిసైడింగ్ అధికారులు ఈ ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు మూడు లక్షల 55 వేల 159 మంది ఉండగా టీచర్స్ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారని తెలిపారు. అందరికీ పోలింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ జరుగుతోందని అన్నారు. పోలింగ్ నిర్వహిస్తున్న అన్ని జిల్లాలలో కలిపి 93 కామన్ పోలింగ్ స్టేషన్లు( టీచర్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ ), 406 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 181 టీచర్స్ పోలింగ్ స్టేషన్లు, మొత్తం 680 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పోలింగ్ సమయానికి 48 గంటల ముందు సమావేశాలు, ప్రచారం నిలిపివేయాలని అభ్యర్థులకు సూచించారు. సోషల్ మీడియా ప్రచారం, సందేశాలు పంపడం వంటివి 48 గంటల ముందే నిలిపివేయాలన్నారు. అభ్యర్థులు కావలసిన అనుమతుల కోసం వివిధ జిల్లాల్లో ఉన్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని అన్నారు. 100% పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమకు ఏజెంట్ కావాలనుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ పవన్ కుమార్ ఆర్డిఓ మహేశ్వర్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,జనతా న్యూస్: ఎలక్షన్ కమిషన్ నియమావళికి అనుగుణంగా ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పరిషత్ ఆడిటోరియంలో శనివారం ప్రిసైడింగ్ అధికారులకు రెండో దఫా శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్ సీసీ కామెరా పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. కెమెరా పనితీరుని పిఓలు పరిశీంచాలని అన్నారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అందించిన కరదీపిక లోని మార్గదర్శకాలు పాటించాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ తేదీన నిర్ణీత ఫారాలను పొరపాటు లేకుండా పూరించాలని, ఫారం 16, పిఓ డైరీ ని జాగ్రత్తగా నింపాలని సూచించారు. ఓటర్ వివరాలను పరిశీలించి గుర్తింపు కార్డుతో సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలపై ప్రతి ప్రిసైడింగ్ అధికారికీ పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్స్ లాకింగ్, సీలింగ్ పకడ్బందీగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, డిఆర్డిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువ ఉత్సవ్ 2024-25 విజయవంతంగా నిర్వహించాలి



### అదన పు కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిద్దిపేట ,జనతా న్యూస్: జిల్లా స్థాయి యువ ఉత్సవ్ 2024-25 విజయవంతంగా నిర్వహించాలని జిల్లా అదన పు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమ అగ్రవాల్ అన్నారు. యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని అమలు చేయుటకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా అదనపు కలెక్టరు అధ్యక్షతన కలెక్టరేట్లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ ఉత్సవాల్లో ఆరు భాగాలపై దృష్టి సారించి, కార్యాచరణ అంశాల్లో భాగంగా జిల్లా విద్యా శాఖ అధికారి మరియు ఇతర అధికారుల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర సంబంధిత సంస్థలతో సమన్వయం చేస్తూ, సైన్స్ మేళా ప్రదర్శన (వ్యక్తిగత మరియు బృందాలు వారిగా) సహా ప్రతి కార్యక్రమాల పర్యవేక్షణ కొరకు కమిటీలు ఏర్పాటు చేయమని ఆదేశాలు జారి చేసినారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ డీగ్రీ కళశాలల్లోనీ ప్రిన్సిపాల్స్, NSS PO\T, NCC ANOలతో మరియు పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర సంస్థలతో సమన్వయం చేయడం ద్వారా యువ ఉత్సవ్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. సైన్స్ మేళా ప్రదర్శన: (వ్యక్తిగత & గ్రూప్) - వివిధ రంగాలలో వినూత్న ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి.యంగ్ రైటర్స్ కాంటెస్ట్: ఇచ్చిన అంశంపై రచనల పోటీ.యంగ్ ఆర్టిస్ట్స్ కాంటెస్ట్: పెయింటింగ్ పోటీ (వివిధ శైలులు).ఫోటోగ్రఫీ పోటీ & వర్క్‌షాప్: ఫోటోగ్రఫీ పద్ధతులపై వర్క్‌షాప్ తర్వాత నేపథ్య ఫోటో సమర్పణ.ఉపన్యాస పోటీ: సంబంధిత అంశాలపై ప్రసంగాలు. జిల్లా సాంస్కృతిక ఉత్సవం (గ్రూప్ ఈవెంట్‌లు): స్థానిక కళ మరియు సంస్కృతిని ప్రదర్శించడం జరుగును అని తెలిపారు.జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో ఆరు కార్యక్రమాలకు అర్హత 15-29 సంవత్సరాలు (30 సెప్టెంబర్ 2024 నాటికి) కల్గిన యువతి యువకులు వారి రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవల్సింధిగా తెలిపారు.మరియు ఈ నెల 25 వ తేదీ న విపంచి కలానిలయంలో జరిగే యువ ఉత్సవ్ పోస్టర్ ని విడుదల చేసారు.ఈ సమావేశంలో యువజన ఉత్సవాల కమిటి సభ్యులు జిల్లా జిల్లా యువజన అధికారి ఎం.రంజిత్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి & డీ.వై.ఎస్.ఓ శ్రీనివాస్ రెడ్డి, డీ.పి.ఆర్.ఓ రవికుమార్, ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, మహిళా ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ కుమార్, డీఐఈ ఓసూపరింటెండెంట్ మూర్తి, ఎన్.వై.కే కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, ఎ.ఎమ్ ఓ అధికారి బేతి భాస్కర్, యెన్.ఎస్.ఎస్ అధికారులు డా.సువర్ణదేవి , డా.ఎమ్. శ్రద్ధనందం, డా.స్రవంతి, రాంచంద్రం, మొదలైనవారు హాజరైనరు.

## దేశం గర్వించదగ్గ గొప్ప నేత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

### - సుడా చైర్మన్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్,జనతా న్యూస్:** దేశ మొదటి విద్యా శాఖ మంత్రి స్వర్గీయ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఇతర నేతలు హాజరై అబుల్ కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప నేత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని, దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని దేశంలో అక్షరాస్యత శాతం పెంచి ఈ దేశాన్ని నాగరికత వైపు నడిపించిన మేధావి అబుల్ కలాం గారు.. మైనారిటీ నేతకు అవకాశం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని వారిని చిన్నచూపు చూస్తూ పరోక్ష దాడులకు దిగుతున్నారని అన్నారు, అబుల్ కలాం గారు ఆశయ సాధనకోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, నేహాల్ అహమ్మద్, ముస్తాక్ ,లాయికు ,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కంరుద్దీన్ ,సలీమ్ ఉద్దీన్ ,కాజా ఖాన్ ,మహమ్మద్ చాంద్ ,షబానా మహమ్మద్ హనీఫ్, విక్టర్ ,కుర్రపోచయ్య ,అబ్దుల్ బారి, షహెన్షా, బషీరుద్దీన్, ఆరిఫ్ ఖాన్, వంగల విద్యాసాగర్, అజీమ్, ఇమామ్, అస్మత్ ,జమీల్ ఖాన్, కలీం, అక్బర్ ,మంద మహేష్, కుంభాల రాజకుమార్ ,వీర దేవేందర్ ,ముల్కల యోనా, నాగుల సతీష్, వనం రాము, పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ల పై విచారణ సరే.... అధికారులపై చర్యలేవి?

### సదరం సర్టిఫికెట్ల అవకతవకల్లో ఫోర్త్ క్లాస్ ఉద్యోగులను తొలగించి చేతులు దులుపుకున్న అధికారులు

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి: బాహ్మణపల్లి యుగేందర్

కరీంనగర్,జనతా న్యూస్: సదరం సర్టిఫికెట్ల అవకతవకలపై సంబంధించిన ప్రధాన సూత్రధారులైన అధికారులను సస్పెండ్ చేయాలని ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేంధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లలో లక్షల రూపాయల కుంభకోణం జరిగిందని ఫోర్త్ క్లాస్ ఉద్యోగులనుండి అధికారుల వరకు విచారణ జరిపించాలని మొదటి నుండి ఏఐవైఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. అధికారులందరూ లక్షల రూపాయలను పప్పుబెల్లంలా పంచు కున్నారని, కంచే చేను మేసిందని. పాత్రధారులు, సూత్రధారులు అందరూ ఆ శాఖలోనే ఉన్నారని ఆరోపించారు. ఒక డిపార్ట్మెంట్ వారు తప్పు చేస్తే వేరే డిపార్ట్మెంట్ అధి కారితో పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి స్తారని, కానీ దానికి విరుద్ధంగా ఈ విచారణ జరిగింద న్నారు. నిబంధనల ప్రకారం సదరం క్యాంపు 200 మందికి మాత్రమే స్లాట్ బుకింగ్ విధానం ఉంటుందని, కానీ దానికి భిన్నంగా హుజురాబాద్ లో సదరం క్యాంపు ఆకస్మికంగా నిర్వహించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అడిషనల్ డిఆర్డిఓ వెంకటేశ్వర్లు నేతృ త్వంలో జరిగిన విచారణ కమిటీ గత యేడాది జనవరి 2021 నుంచి 2022 ఫిబ్రవరి వరకు విచారణ జరిపి కలెక్టర్కు నివేదిక సమర్పించిందని, కానీ హుజురాబా ద్లో జరిగిన సదరం సర్టిఫికెట్లపై విచారణ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుప త్రిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేట్లు లక్షల రూపాయలు వసూలు చేశారని,వారితో పాటుగా సంబంధిత అధికారులు కూడా ఉన్నారని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి వెనుక ఉన్న సూత్రధారులను బయటకు లాగాలన్నారు. సదరం సర్టిఫికెట్ల లో లక్షల రూపాయలు చేతులు మారాయని కాని అధికారులు ఫోర్త్ క్లాస్ ఉద్యోగులను తొలగించి చేతులు దులుపుకున్నారన్నారు సూత్రధారులను సస్పెండ్ చేసే వరకు వదలేది లేదని యుగేంధర్ హెచ్చరించారు.

# పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ కృషి

**కాంగ్రెస్ నేత రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్**

**ఇది ప్రణవ్ కు కౌశిక్ కు మధ్య జరుగుతున్న పోటీ**

**అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు ఖాయం**




హుజురాబాద్, ఫిబ్రవరి 22 జనతా న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ ఆధ్వర్యంలో శనివారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్సీ పట్టబద్రుడా సమావేశంలో రియాజ్ మాట్లాడారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు సామాన్యుల, నిరుద్యోగుర విజయమని, తప్పుడు ప్రచారాలు సోషల్ మీడియాలో చేయడంలో బీజేపీ టాప్ లో ఉందని విమర్శించారు. విజయపథంలో కాంగ్రెస్ పార్టీ ఉంది కాబట్టే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పదేళ్ల బీజేపీ,బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని,2014 ఎన్నికల సమయంలో యాడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ మోడీ ప్రభుత్వం 11ఏళ్లలో 2లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన యాడాదిలో 55,000 వేల ఉద్యోగాలు ఇచ్చామని దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వలేదని, గతంలో ఉద్యోగుల జీతాల విషయంలో అవస్థలు పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి తారీఖున జీతాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను కాంగ్రెస్ అభివృద్ధి చేస్తే, బీజేపి వాటిని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందని,బీజేపి పార్టీ తెలంగాణకు బడ్జెట్ లో అన్యాయం చేసిందనీ 8 మంది ఎంపీలు ఉన్నా బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని, బీజేపి, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్నాయని అన్నారు. ఫీజ్ రెంబర్స్మెంట్ ద్వారా అనేక మంది పట్టభద్రులుగా మారారని గుర్తు చేశారు. ట్యూషన్ చెప్పుకునే సాధారణ స్థాయి నుండి విద్యావేత్తగా ఎదిగిన నరేందర్ రెడ్డికి హుజురాబాద్ నియోజకవర్గం నుండి మంచి మెజారిటీ ఇవ్వాలని, పట్టభద్రుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా, శాసన మండలిలో బలంగా కొట్లాడతరని అన్నారు. ఎమ్మెల్సీ గా గెలిచిన జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్ భవన్ నిర్మిస్తానని తెలిపారు. త్వరలో హుజురాబాద్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షయల్ స్కూల్ మంజూరు చెపిస్తున్నామని అన్నారు. రానున్న మూడు నెలల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టాటా సఫారీ స్టెల్త్

టాటా సఫారీ వచ్చి 27 ఏళ్లు అయిన సందర్భంగా ప్రత్యేక ఎడిషన్ సఫారీ స్టెల్త్ ప్రీమియం ఎడిషన్‌ను టాటా మోటార్స్ తీసుకొచ్చింది. కేవలం 2,700 వాహనాలే ఈ ఎడిషన్‌లో విక్రయిస్తామని పేర్కొంది. ఈ ప్రీమియం ఎడిషన్ టాటా హారియర్, సఫారీ రెండింటిలోనూ లభిస్తుంది. తమ వాహనం ప్రత్యేకంగా ఉండాలని కోరుకునే వారిని లక్ష్యంగా చేసుకుని, దీన్ని తీసుకొచ్చినట్లు టాటా మోటార్స్ పేర్కొంది. హారియర్ స్టెల్త్ ధర రూ.25.09 లక్షలు, సఫారీ స్టెల్త్ ధర రూ.25.74 లక్షలు (ఎక్స్ షోరూం-దిల్లీ)గా ఉన్నట్లు తెలిపింది.


## వ్యాపార రుణాలపై ప్రీపేమెంట్ సుంకం రద్దు!

- **ప్రతిపాదించిన ఆర్‌బీఐ**

**ముంబయి:** వ్యక్తులు లేదా సూక్ష్మ, చిన్న కంపెనీ (ఎమ్ఎస్ఈ)లు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ముందస్తుగా పూర్తిగా తీర్చివేయాలని (ఫోర్‌క్లోజర్) భావించిన పక్షంలో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు విధించే పెనాల్టీలు/ఛార్జీలను రద్దు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం ప్రతిపాదించింది. టైర్ 1, టైర్ 2 ప్రాథమిక (పట్టణ) కో ఆపరేటివ్ బ్యాంకులు, ప్రాథమిక స్థాయి (బేస్ లేయర్) ఎన్‌బీఎఫ్‌సీలు మినహా, ఇతర నియంత్రిత సంస్థలు చలన వడ్డీ రుణాలపై వ్యక్తులు/ఎమ్ఎస్ఈలు చేసే ముందస్తు చెల్లింపు(ఫోర్‌క్లోజర్)లపై ఎటువంటి ఛార్జీలు/పెనాల్టీలు విధించరాదని ఆర్‌బీఐ ముసాయిదా సర్క్యులర్ స్పష్టం చేసింది. ఎమ్ఎస్ఈ రుణ స్వీకర్తలకు ఈ నిబంధనలు రూ.7.5 కోట్ల రుణ (ఒక్కో గ్రహీతకు) పరిమితి వరకే వర్తిస్తాయి. వచ్చే నెల 21లోపు దీనిపై అభిప్రాయాలు తెలపొచ్చని ఆర్‌బీఐ సూచించింది.

# భారత్‌లోకి 'ఏఐ ఏజెంట్'..

## ఓపెన్ ఏఐ నుంచి మరో ఆవిష్కరణ



చాట్‌జీపీటీని ప్రపంచానికి పరిచయం చేసిన ఓపెన్‌ఏఐ సంస్థ చాట్ బాట్ సేవలతో సంచలనం సృష్టించింది. కృత్రిమ మేధ సేవల్ని మరింత మెరుగ్గా అందించేందుకు తాజాగా ఏఐ ఏజెంట్ సదుపాయాన్ని తీసుకొచ్చింది. మనుషులకు వం-ర్చువల్ సహోద్యుగులుగా మారే ఏఐ ఏజెంట్ సేవల్ని కొన్ని దేశాల్లో అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని కంపెనీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. యూజర్లు ఇచ్చే ప్రాంప్ట్ ఆధారంగా ఆన్‌లైన్‌లో ఆటోమెటిక్‌గా పనులు నిర్వహించే సామర్థ్యంతో ఈ ఏఐ ఏజెంట్ పనిచేస్తుంది. ఇప్పటికే అమెరికాలో చాట్‌జీపీటీ ప్రో యూజర్లకు మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా భారత్ సహా ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, యూకేలోనూ సేవల్ని యాక్సెస్ చేసే సదుపాయం కల్పించింది. అయితే ప్రస్తుతం ఐరోపా దేశాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురాలేదని త్వరలోనే తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. సంక్లిష్టమైన ఆన్‌లైన్ టాస్క్‌లు ఆటోమెటిక్‌గా నిర్వహించగలిగే సామర్థ్యంతో రూపొందించిన ప్రత్యేక ఏఐ మోడల్ ఇది. ఆపరేటర్ కంప్యూటర్- యూజింగ్ ఏజెంట్ ఆధారంగా ఈ ఏఐ ఏజెంట్ పనులు నిర్వర్తిస్తుంది. జీపీటీ- 4, 3 మోడల్‌లోని అధునాతన నైపుణ్యాలు కలిగి ఉంటుంది. ఓ ప్రత్యేక బ్రౌజర్‌లో ఈ ఏఐ ఏజెంట్ పనిచేస్తుంది. యూజర్లు ఇతర కార్యకలాపాలపై దృష్టిసారించేటప్పుడు స్వతంత్రంగా పనులు నిర్వర్తించగల సామర్థ్యం ఉండటం విశేషం. టెక్ట్స్, ఇమేజ్ తరహా ఇన్‌పుట్‌ల ను స్వీకరిస్తుంది. లోపాల్ని పరిష్కరించడం, ఊహించని సవాళ్లకు అనుగుణంగా పనులు నిర్వహించడం, ఉత్పాదకతను పెంచేందుకు ఈ ఏజెంట్ సాయం చేస్తుంది. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేసే పనిని ఈ ఏఐ ఏజెంట్లు పూర్తి చేయగలవని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఓ సందర్భంలో వెల్లడించారు. అయితే, ఈ ఏజెంట్లు తమకు కేటాయించిన పనిని మాత్రమే పూర్తి చేయగలవన్నారు. గొప్ప ఆలోచనలతో ముందుకురాలేవని చెప్పారు. ఈ క్రమంలో మానవ ప్రమేయం అవసరం ఉంటుందని చెప్పారు. దీర్ఘకాలంలో విజ్ఞానానికి సంబంధించిన అన్నిరంగాల్లో ఈ ఏఐ ఏజెంట్లు చొచ్చుకొస్తాయని శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు.

# జీవితాంతం పింఛను కోసం




ఒకేసారి ప్రీమియం చెల్లించి, జీవితాంతం క్రమం తప్పని ఆదాయం కోరుకుంటున్నారా? ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకొనే ప్రభుత్వ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త పింఛను పాలసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. మరి దీని వివరాలేమిటో తెలుసుకుందామా.. పదవీ విరమణ తర్వాత సురక్షిత పథకాలను ఎంచుకునేందుకే చాలామంది మొగ్గు చూపిస్తుంటారు. అనిశ్చితిగా ఉండే మార్కెట్ ఆధారిత పథకాలు కాస్త మంచి రాబడిని అందిస్తున్నా.. ఎలాంటి ఇబ్బందీ ఉండకుండా రాబడి హామీ పథకాలు ఎక్కువ మందిని ఆకర్షిస్తుంటాయి. ఇలాంటి పథకమే ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్. ఇది నాన్‌పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, వ్యక్తిగత, ఇమ్మీడియట్ యాన్యుటీ పాలసీ. ప్రీమియం చెల్లించిన వెంటనే యాన్యుటీ (పింఛను) ప్రారంభమవుతుంది.

- 18 ఏళ్లు పూర్తయిన వారెవరైనా సరే ఈ పాలసీలో చేరొచ్చు. కొన్ని షరతులకు లోబడి 100 ఏళ్ల వరకూ పాలసీలో చేర్చుకుంటారు.
- కనీస యాన్యుటీ కొనుగోలు ధర రూ.1,00,000. ఎలాంటి గరిష్ఠ పరిమితీ లేదు.
- కనీస యాన్యుటీ మొత్తం నెలకు రూ.1,000. మూడు నెలలకు రూ.3,000. ఆరు నెలలకు రూ.6,000. ఏడాదికోసారి కావాలనుకుంటే రూ.12,000. నెలకు కనీసం రూ.1,000 పింఛను వచ్చేలా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- గరిష్ఠంగా ఎంత యాన్యుటీ కావాలనుకున్నా తీసుకోవచ్చు. ఎలాంటి పరిమితీ లేదు.
- పాలసీదారుడు తన వరకే పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో దాదాపు 14 రకాల ఆప్షన్లు ఉన్నాయి. లేదా తన తదనంతరం జీవిత భాగస్వామికీ యాన్యుటీ లభించేలా జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్‌నూ తీసుకోవచ్చు. ఇందులో 7 రకాలున్నాయి.
- పాలసీని తీసుకున్న తర్వాత మూడు నెలల నుంచి దీనిపై రుణం తీసుకోవచ్చు. పాలసీదారుడు మరణిస్తే ఎంచుకున్న ఆప్షన్‌ను బట్టి, పూర్తి మొత్తాన్ని నామినీకి చెల్లించడం లేదా జీవిత భాగస్వామికి యాన్యుటీని ఇవ్వడం జరుగుతుంది.
- ఉదాహరణకు 60 ఏళ్ల వ్యక్తి రూ.5లక్షలు చెల్లించి, (ఆప్షన్-ఏ లైఫ్ యాన్యుటీ) పాలసీ తీసుకున్నాడనుకుందాం. అప్పుడు జీవితాంతం నెలకు రూ.3,316 వస్తాయి. మరణించిన తర్వాత నామినీకి రూ.5లక్షలు బీమా సంస్థ చెల్లిస్తుంది. అదే 65 ఏళ్ల వ్యక్తి రూ.5లక్షలు చెల్లించి ఈ ప్లాన్ తీసుకుంటే.. నెలకు రూ.3,612 వరకూ వచ్చే అవకాశం ఉంది.
- వయసు, ఎంచుకున్న ఆప్షన్, చెల్లించిన ప్రీమియాన్ని బట్టి, పింఛను మొత్తం మారుతుంది.

# న్యాయవాదులకు దిశ నిర్దేశం

## - మంత్రి శ్రీధర్ బాబు



కరీంనగర్,జనతా న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి మద్దతుగా కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు మంత్రివర్యులు దిశ నిర్దేశం చేసారు . శుక్రవారం రాత్రి ఓ ప్రైవేట్ హోటల్ లో డిసిసి లీగల్ సెల్ న్యాయ వాదుల సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరై మాట్లాడుతు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థికి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి ఓటు వేసే దిశగా న్యాయవాదులు ప్రయత్నం చేయాలని, స్థానిక కాంగ్రెస్ లీడర్లతో సమన్వయ పరుచుకోవాలని వారు సూచనలు సలహాలు తీసుకొని, న్యాయవాదుల యొక్క సమస్యలను పరిష్కారం దిశగా కూడా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్త నని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి

వర్యులు రేవంత్ రెడ్డి గారికి న్యాయవాదుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి లీగల్ సెల్ బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నగర అధ్యక్షులు కూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లతో పాటు తదితరుల పాల్గొన్నారు.


# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు





జనత న్యూస్ బెజ్జంక:బెజ్జంకి మండలం గుండారం గ్రామం లో ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పటల్లో చికిత్స పొందిన ఎలుకంటి శ్రీవాణి కీ 27వేల రూపాయలు, ఈదులకంటి సుజాత కు 30 వేల రూపాయల హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం మంజూరైనటువంటి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల ఆదేశానుసారం శనివారం గుండారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ పుల్లపోచయ్య , కాంగ్రెస్ నాయకులు కోరుకొప్పుల సంపత్ గౌడ్, ఎలుకంటి శ్రీనివాస్ రెడ్డి, గాజర్ల శ్రీనివాస్, వనంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కంది శంకర్, వడ్లకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలం గూడెం, వడ్లూరి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,ముక్కిస రత్నాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ ల నేతృత్వంలో శనివారం కాంగ్రెస్ పార్టీ బలపరు-స్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి నరేందర్ రెడ్డి అని , రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులలోనే అనేక ఉద్యోగాలు నియమించారని, రానున్న కాలంలో పట్టభద్రుల కోసం అనేక ఉద్యోగ ప్రకటనలు సిద్ధంగా ఉన్నాయని, ఉద్యోగ ప్రకటనల కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపి , ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయించే సామర్థ్యం ఉన్న వ్యక్తి నరేందర్ రెడ్డి అని పట్టభద్రులకు వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, ఎస్టీ సేల్ అధ్యక్షుడు కొమురయ్య, ఏఎంసీ డైరెక్టర్ పులి సంతోష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు బోనాల ఐలయ్య, మంద శేఖర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు భైర సంతోష్, గూడెల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిరకాల ప్రత్యర్థితో పోరు..

## ఈసారి ఆ లెక్క సరి చేస్తారా..?

**ఛాంపియన్స్ ట్రోఫీలో అన్ని మ్యాచ్‌లది ఒక లెక్క.. ఆ ఒక్క మ్యాచ్‌ది మరో లెక్క. ఆ జట్లు తలపడుతుంటే.. ఆ దేశాల నుంచే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులు టీవీల ముందుకు చేరిపోతారు. వేదిక ఏదైనా సరే.. ఆ జట్ల మధ్య పోరు హైఓల్టేజ్ మ్యాచ్‌గా మారుతుంది. ఇప్పటికే అర్థమై ఉంటుంది. అది చిరకాల ప్రత్యర్థులైన భారత్–పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అని. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దాయాది జట్లు ఆదివారం తలపడుతున్నాయి. మరి గత ఫైనల్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందా?**



ఇక డిఫెండింగ్ ఛాంపియన్ పాక్ ఈ ట్రోఫీని ఓటమితో ప్రారంభించగా.. బంగ్లాపై ఘన విజయంతో భారత్ రెట్టించిన ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఫకర్ జమాన్ దూరం కావడం పాక్ జట్టుకు పెద్ద లోటే. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఫామ్ లేమి కూడా వారిని ఇబ్బంది పెట్టే అంశమే. మరోవైపు బుమ్రా లేకపోయినా.. టీమ్‌ఇండియా పేస్ దళాన్ని తొలి మ్యాచ్‌లో అద్భుతంగా షమీ ఐదు వికెట్ల ప్రదర్శనతో ముందుకు నడిపించాడు. అతడికి హర్షిత్ రాణా తోడయ్యాడు. స్పిన్నర్లు కూడా తమవంతు ప్రాత్ర పోషించారు. మరి వీరు పాకిస్థాన్‌పై ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. ఇక దూకుడుగా ఆడుతున్న రోహిత్, శతక వీరుడు గిల్ మరోసారి చెలరేగితే.. టీమ్‌ఇండియాకు భారీ పరుగులు ఖాయమే. పాకిస్థాన్‌పై గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లి.. తన మునుపటి ఫామ్‌ను అందుకొని రాణిస్తే.. భారత్‌కు తిరుగుండదు.

### వారికి చావో రేవో..

అయితే.. తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన పాకిస్థాన్‌కు భారత్‌తో మ్యాచ్ అత్యంత కీలకం. ఈ మ్యాచ్‌లో ఓడితే అంతే.. ఆ జట్టు టోర్నీ నుంచి ఇంటి ముఖం పట్టాల్సిందే. దీంతో ఆ జట్టును తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. దాయాదుల పోరు అంటే ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాణంపెట్టి ఆడతారన్న విషయం తెలిసిందే. ఈ ఆసక్తికరమైన పోరు నేపథ్యంలో రెండు జట్లు ఛాంపియన్స్ ట్రోఫీలో ఎన్నిసార్లు తలపడ్డాయి.. ఫలితాలు ఎలా ఉన్నాయంటే..? ఇప్పటివరకూ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్ జట్లు ఐదుసార్లు తలపడ్డాయి. ఇందులో పాక్‌దే పైచేయి అని చెప్పొచ్చు. ఎందుకంటే మూడు సార్లు పాకిస్థాన్ నెగ్గగా.. రెండుసార్లు భారత్ విజయం సాధించింది. 2004, 2009, 2013లో ఒక్కోసారి ఇరు జట్లు తలపడగా.. చివరిసారిగా జరిగిన 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో దాయాది దేశాలు రెండుసార్లు తలపడటం విశేషం. ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరాయి. 2004 ఛాంపియన్స్ ట్రోఫీలో చిరకాల ప్రత్యర్థులు తొలిసారి తలపడ్డారు. గ్రూప్ సీలో ఉన్న ఈ రెండు జట్ల మధ్య సెప్టెంబర్ 19న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 200 పరుగులు చేయగా.. పాకిస్థాన్ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 2013లో గ్రూప్ బీలో భాగంగా లీగ్ స్టేజ్ చివర్లో జూన్ 15న రెండు జట్లు తలపడ్డాయి. ఈసారి ఇండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వాతావరణం అనుకూలించకపోవడంతో 40 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో పాక్‌ను 165 పరుగులకు భారత్ కట్టడి చేసింది. ఆ తర్వాత కూడా వర్షం అంతరాయం కలిగించడంతో టీమ్‌ఇండియా లక్ష్యాన్ని 22 ఓవర్లకు 102 పరుగులకు కుదించారు. 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి పాక్‌పై తొలి విజయాన్ని భారత్ నమోదు చేసింది. రెండు వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై ఘన విజయాన్ని భారత్ నమోదు చేసింది. గ్రూప్ బీలో భాగంగా జూన్ 4న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ మ్యాచ్ జరిగింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 48 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మూడు వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్‌కు 41 ఓవర్లలో 289 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే.. పాక్ 33.4 ఓవర్లలో 164 పరుగులే చేసింది. డక్‌వర్త్ పద్ధతిలో టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది. యువరాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. 2017 ఫైనల్‌కు చేరిన భారత్.. తిరిగి పాకిస్థాన్‌తోనే తలపడింది. జూన్ 18న లండన్‌లోని ఓవల్ మైదానం వేదికగా మ్యాచ్ జరగ్గా.. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో టీమ్‌ఇండియా ముందు 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్.. ఘోరంగా విఫలమై 158 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో తొలిసారి పాకిస్థాన్ ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడింది.

### ఓటమికి బదులు తీర్చుకొనే అవకాశం

ఆనాటి ఫైనల్‌లో ఘోర ఓటమికి బదులు తీర్చుకొనే అవకాశం టీమ్‌ఇండియాకు వచ్చింది. గత వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన నేపథ్యంలో.. మరోసారి ఆ జట్టును ఓడించి సత్తా చాటాలని ప్రతీ భారత అభిమాని కోరుకుంటున్నాడు. దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ఇరు జట్ల మధ్య ఫలితాల లెక్కను 3–3తో సరిచేయాలని ఆకాంక్షిస్తున్నారు. పలువురు సీనియర్లకు ఇదే చివరి ట్రోఫీ అని భావిస్తున్న తరుణంలో దాయాదిపై చెలరేగి ఆడి.. చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసి కెరీర్‌కు ముగింపు పలకాలని కోరుతున్నారు.




# కంగారుల్లో 'జోష్'

## 352 టార్గెట్ ఉఫ్..

**లాహోర్:** ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లిష్ జట్టు 8 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. టోర్నీ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు కాగా.. ఈ కొండంత లక్ష్యాన్ని కంగారులు 5 వికెట్లు కోల్పోయి 15 బంతులు మిగిలుండగానే ఛేదించారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ (120, 86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) శతక్కొట్టాడు. అలెక్స్ కేరీ (69), మాథ్యూ షార్ట్ (63) అర్ధ శతకాలు బాదారు. లబుషేన్ (47) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ట్రావిస్ హెడ్ (6), స్టీవ్ స్మిత్ (5) విఫలమవడంతో ఆసీస్ 27 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో షార్ట్, లబుషేన్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేరగా.. ఇంగ్లిస్, కేరీ బాధ్యత తీసుకుని జట్టును విజయం దిశగా నడిపించారు. ముఖ్యంగా జోష్ ఇంగ్లిస్ మంచి షాట్లు ఆడుతూ ఆస్ట్రేలియా జట్టులో జోష్ నింపి చరిత్రాత్మక విజయం అందించాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (32, 15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. తొలుత ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఓపెనర్ బెన్ డకెట్ (165, 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. జో రూట్ (68, 78 బంతుల్లో 4 ఫోర్లు) రాణించాడు. ఫిల్ సాల్ట్ (10), జేమీ స్మిత్ (15) త్వరగానే పెవిలియన్ చేరడంతో ఇంగ్లాండ్ 43 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రూట్‌తో కలిసి డకెట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. 95 బంతుల్లో శతకం బాదిన డకెట్.. మరో 39 బంతుల్లో 150 పరుగుల మార్కు అందుకున్నాడు. జోస్ బట్లర్ (23), లివింగ్‌స్టన్ (14) పరుగులు చేయగా.. హ్యారీ బ్రూక్ (3) నిరాశపర్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో డ్వారిషూస్ 3, ఆడమ్ జంపా 2, లబుషేన్ 2, మ్యాక్స్‌వెల్ ఒక వికెట్ పడగొట్టారు.

# భారత్‌ను ఇబ్బంది పెట్టే స్పిన్నర్ పాక్‌లో లేడు : మంజ్రేకర్



గత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌ను పాక్ ఓడించి విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఇరు జట్లు తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. ఆదివారం దుబాయ్ వేదికగా దాయాదుల పోరు జరగనుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో ఓడిన పాక్‌కు ఈ మ్యాచ్ అత్యంత కీలకం. భారత్ కూడా వరుసగా రెండో విజయం సాధించి సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలని భావిస్తోంది. జట్టుపరంగా పాక్‌తో పోలిస్తే భారత్ చాలా బలంగా ఉందని మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. పాకిస్థాన్‌లో కనీసం ఒక్క సరైన స్పిన్నర్ లేడని వ్యాఖ్యానించాడు. "భారత్ జట్టుకు పాకిస్థాన్ ఏ స్థాయిలోనూ దగ్గరగా లేదు. ఇటీవల ఐసీసీ ట్రోఫీల్లో పాక్‌పై టీమ్‌ఇండియా ఆధిపత్యం ప్రదర్శించింది. గతంతో పోలిస్తే ఇప్పుడు పాక్ మరింత బలహీనంగా ఉంది. కీలకమైన పోరులో మెరిసేందుకూ అక్కడేమీ లేదు. ఇరుదేశాల క్రికెట్ అభిమానులను అడిగితే కచ్చితంగా దాయాదుల పోరే అత్యుత్తమమని చెబుతారు. కానీ, క్వాలిటీపరంగా ఇంగ్లండ్ – ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ ఇంకాస్త బెటర్. కానీ, భారత్ – పాక్ మ్యాచ్ కోసమే చాలామంది ఎదురుచూస్తుంటారు. క్రికెట్ ఫ్యాన్స్‌కు సండే ఫీవర్ రావడం ఖాయం" అని మంజ్రేకర్ తెలిపాడు.

### అబ్రార్ ఒక్కడే స్పెషలిస్ట్

"పాకిస్థాన్ జట్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా అబ్రార్ మాత్రమే ఉన్నాడు. దుబాయ్ పిచ్‌పై నెట్టుకురావడం కష్టమే. సల్మాన్ అఘా లేదా ఖుష్దిల్ షా కూడా స్పిన్ వేయగలరు. కానీ, భారత బ్యాటర్లను ఇబ్బందిపెట్టేంత కాదనేది నా అభిప్రాయం. పేస్ ప్రభావం కూడా ప్రారంభంలోనే ఉంటుంది తప్ప.. మ్యాచ్ ఆసాంతం ప్రభావం చూపించదు. ఈవిషయంలో టీమ్‌ఇండియా మెరుగైన పరిస్థితుల్లోనే ఉంది" అని మంజ్రేకర్ వెల్లడించాడు.

# అతడు.. పాక్‌పై 60 బంతుల్లోనే సెంచరీ చేయగలడు : యువరాజ్ సింగ్

"కొద్దిసేపు సంయమనం పాటిస్తే పాకిస్థాన్‌పై భారత కెప్టెన్ రోహిత్ శర్మ సెంచరీ చేయగలడు. అదీనూ కేవలం 60 బంతుల్లో సాధిస్తాడు" అని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ వ్యాఖ్యానించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం భారత్ – పాకిస్థాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత కెప్టెన్ రోహిత్ దూకుడుగా ఆడిన సంగతి తెలిసిందే. మరోసారి అదే ప్రదర్శన పునరావృతం చేయాలని రోహిత్‌కు యువీ సూచించాడు. "రోహిత్ శర్మ తన ఫామ్‌ను కొనసాగిస్తే కేవలం 60 బంతుల్లోనే సెంచరీ బాదేస్తాడు. అతడి ఆటతీరు అలా ఉంటుంది. ఒక్కసారి కుదురుకున్నాడంటే.. కేవలం ఫోర్లే కాదు సిక్స్‌లతోనే పరుగులు రాబట్టేస్తాడు. షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో అత్యుత్తమం. అలాగే 145–150 కి.మీ. వేగంతో వచ్చే బంతినీ అలవోకగా ఆడేస్తాడు. చాలా తేలికగా హుక్ చేసి బౌండరీగా మారుస్తాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించే ప్లేయర్" అని యువీ వెల్లడించాడు. "భారత కెప్టెన్ రోహిత్, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లికి ఫామ్‌తో సంబంధమే లేదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మరీ ముఖ్యంగా వన్డేల్లో వారిద్దరూ మ్యాచ్ విన్నర్లు. రోహిత్ ఇబ్బందిపడుతూనే పరుగులు రాబడుతున్నాడు. అదే కాస్త కుదురుకుంటే ప్రత్యర్థికి మరింత ప్రమాదమే" అని యువీ తెలిపాడు.

### ఆ విషయంలో మరో మాట లేదు : ఇంజమామ్

"ప్రస్తుతం భారత జట్టులోని ప్రతి క్రికెటరూ అద్భుతమైన ప్లేయర్లనడంలో అనుమానమే లేదు. అందులోనూ విరాట్, రోహిత్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జట్టు విజయాల్లో గత రెండు దశాబ్దాలుగా ప్రభావం చూపిస్తున్నారు. ఒకవేళ వారిద్దరూ త్వరగా ఔటయ్యారంటే భారత డ్రెస్సింగ్ రూమ్ పరిస్థితి ఇబ్బందిగా ఉంటుంది. అలాగని మిగతా ప్లేయర్లు సరిగ్గా ఆడరని కాదు. పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ ఔటైనా మా జట్టులో ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ప్రత్యర్థి బౌలర్లకు అప్పుడు మరింత ఉత్సాహం వస్తుంది. రోహిత్, విరాట్‌ను త్వరగా ఔట్ చేయగలిగితేనే పాక్‌కు అడ్వాంటేజ్" అని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ వ్యాఖ్యానించాడు.






## ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ మ్యాచ్‌లో 'జనగణమన'

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా నేడు లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మ్యాచ్ జరుగుతోంది. ఆసీస్ టాస్ గెలిచి బౌలింగ్‌ఎంచుకుంది. అయితే, మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులు పొరపాటున భారత జాతీయ గీతాన్ని కొన్ని సెకన్లపాటు ప్లే చేశారు. దీంతో ఆసీస్ ప్లేయర్లు, స్టేడియంలో ఉన్న అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో వెంటనే గడాఫీ స్టేడియం నిర్వాహకులు అప్రమత్తమైన జనగణమనను ఆపేశారు. తర్వాత ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని ప్లే చేశారు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా టీమ్‌ఇండియాను పాక్‌కు పంపడానికి భారత్ నిరాకరించింది. దీంతో భారత్ ఆడే మ్యాచ్‌లను యూఏఈలోని దుబాయ్‌లో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు.

# భారత్‌తో కీలక మ్యాచ్

### 'స్పెషల్ కోచ్'ను నియమించుకున్న పాకిస్థాన్

ఛాంపియన్స్ ట్రోఫీలో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఆదివారం (ఫిబ్రవరి 23)న దుబాయ్ వేదికగా ఈ హైఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. బంగ్లాదేశ్‌ను ఓడించి జోరుమీదున్న టీమ్‌ఇండియా.. రేపు జరగబోయే మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను మట్టికరిపించి 2017 ఫైనల్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. అయితే, ఈ మ్యాచ్ పాకిస్థాన్‌కు చావోరేవో లాంటిది. న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసిన పాక్.. మిగిలిన రెండు మ్యాచ్‌లు (భారత్‌తో, బంగ్లాదేశ్‌తో) గెలిస్తేనే సెమీస్ చేరే అవకాశముంటుంది. టీమ్‌ఇండియాతో జరిగే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడితే ఆ జట్టు సెమీస్ చేరదు. దీంతో భారత్‌తో జరిగే మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సెమీస్ రేసులో ఉండాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియాతో మ్యాచ్ కోసం 'స్పెషల్ కోచ్'ను నియమించుకుంది. ప్రస్తుతం తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఉన్న సెలక్టర్ అకిబ్ జావేద్ టీమ్‌ఇండియాతో మ్యాచ్ కోసం జట్టును సిద్ధం చేయడంలో సహకరించేందుకు మాజీ సహచరుడు ముదస్సర్ నాజర్ సహాయాన్ని తీసుకుంటున్నాడు. ముదస్సర్‌కు యూఏఈ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. అతను కొన్నాళ్లుగా దుబాయ్ ఉంటూ ఐసీసీ గ్లోబల్ అకాడమీలో పనిచేస్తున్నాడు. అకిబ్ జావేద్ విజ్ఞప్తి మేరకు ముదస్సర్ శుక్రవారం పాకిస్థాన్ జట్టుతో కలిశాడు. నెట్ సెషన్స్‌లో పాల్గొని ఆటగాళ్లకు సూచనలిస్తున్నాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అయిన నాజర్ (1993–2001) మధ్య పలుమార్లు పాక్ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు. తర్వాత కెన్యా, యూఏఈ టీమ్‌లకు కూడా కోచ్‌గా వ్యవహరించాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ముదస్సర్ 76 టెస్టులు ఆడి 4,114 పరుగులు, 122 వన్డేల్లో 2,653 పరుగులు చేశాడు.







## డర్టీ బ్యూటీ అందాల షో

'చిలసౌ' సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రుహాని శర్మ. నార్త్ ఇండియా నుంచి సౌత్ ఇండియాకు వచ్చిన ఈ అమ్మడు ఆశించిన స్థాయిలో గుర్తింపును సొంతం చేసుకోలేక పోయింది. హీరోయిన్‌గా ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు కొన్నే అయినా సోషల్ మీడియా ద్వారా మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. 2013లో థేకా బై అమ్మీ బాస్, క్లాస్‌రూమ్, కుడి తు పటాకా పంజాబీ మ్యూజిక్ ఆల్బమ్స్‌లో నటించింది. 2018లో టాలీవుడ్‌లో చిలసౌ సినిమాలో నటించడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా ఈ అమ్మడు టాలీవుడ్‌లో ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది.

మొదటి సినిమా చిలసౌతో గుర్తింపు దక్కించుకున్న ఈ అమ్మడు ఆ తర్వాత హిట్ : మొదటి కేసు సినిమాలోనూ నటించింది. ఆ సినిమా కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సమయంలోనే 'డర్టీ హరి' సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ డర్టీ సినిమాలో డీసెంట్‌గానే నటించినప్పటికీ ఆకట్టుకోలేక పోయింది. ఆ తర్వాత నూటొక్క జిల్లాల అందగాడు సినిమాలోనూ నటించింది. మెల్ల మెల్లగా ఈ అమ్మడి ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. గత ఏడాది ఈమె నటించిన సైంధవ్ సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. గత ఏడాది అయిదు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుహాని శర్మ ఒక్క హిట్ అందుకోలేక పోయింది. ప్రస్తుతం తమిళ్‌లో ఒక సినిమా మినహా మరే సినిమాలను ఈమె చేయడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి ఈమెకు ఆఫర్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ముందు ముందు ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా వార్తల్లో నిలిచి, తన అందంతో ఆకట్టుకుంటే ఆఫర్లు వస్తాయేమో చూడాలి. ఈసారి ఈ అమ్మడు బెడ్ పై అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాకు నైట్‌కి మధ్య లవ్ స్టోరీ అంటూ ఈ నైట్ షేడ్ బెడ్ రూం ఫోటోలను షేర్ చేసింది.

## ఆమెలా ఎవరినీ విమర్శించను..

**- కంగన సోదరి వ్యాఖ్యలను తిప్పికొట్టిన తాప్సీ**

విమర్శలపై తనదైన శైలిలో స్పందించడంలో నటి తాప్సీ ఎప్పుడూ ముందుంటారు. గతంలో తనని ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేసిన నటి కంగనా రనౌత్ సోదరి రంగోలీని ఉద్దేశించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. అలాంటి కామెంట్స్‌ను తాను పెద్దగా పట్టించుకోనని అన్నారు. మన మాటలే మన వ్యక్తిత్వానికి అద్దం పడతాయని తెలిపారు. రంగోలీ మాట్లాడిన విధంగా తాను ఎవరినీ విమర్శించనని చెప్పారు. "నేను కంగనను కాపీ కొడుతున్నానని గతంలో ఆమె అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆమెను అదేవిధంగా అనుకోనివ్వండి. అందులో ఎలాంటి ఇబ్బందీ లేదు. కంగనకు వచ్చినంత పారితోషికం కూడా నాకు రావడం లేదు. కంగన ఎంతో టాలెంట్ కలిగిన నటి. అలాంటి ఆమెను నేను కాపీ కొట్టానని అంటే నేను సంతోషంగా స్వీకరిస్తాను. మనిషి ఎదుగుదల, అతని వ్యక్తిత్వాన్ని మాటలే నిర్ణయిస్తాయి. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వతహాగా తన కెరీర్‌లో రాణిస్తోన్న ఒక మహిళను ఉద్దేశించి ఆమె మాదిరిగా నేను విమర్శలు చేయను" అని తాప్సీ అన్నారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలనే ఆశపడే వారిని ఉద్దేశించి.. "పరిశ్రమ ఎప్పుడూ ఒకేలా ఉండదు. హార్డ్‌వర్క్ ఉంటే ఏదైనా సాధించేయొచ్చు అనుకుంటే పొరపాటే. ఎన్నో మాటలు పడాల్సి ఉంటుంది. ఇగోలను పక్కన పెట్టేయండి. అలా కానీ పక్షంలో మీరు ఎంతగానో బాధపడతారు. ఎంత శ్రమించినా ఆశించిన విజయం అందుకోని పక్షంలో మరో రంగంలో రాణించేలా ప్లాన్-బి సిద్ధం చేసుకోండి" అని తెలిపారు. నటీనటులను వాళ్ల ప్రదర్శన, టాలెంట్‌ను ఆధారంగా చేసుకుని జడ్జ్ చేయాలి కానీ.. వాళ్ల సోషల్‌మీడియా ఫాలోయింగ్‌ను ఉద్దేశించి కాదన్నారు. వివాహ బంధంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే రిలేషన్‌లోకి అడుగుపెట్టిన వెంటనే పెళ్లి చేసుకోలేదన్నారు. వివాహం తర్వాత తన జీవితం ప్రశాంతంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రస్తుతం ఆమె 'వో లడ్కీ హై కహా', 'గాంధారి' చిత్రాల కోసం వర్క్ చేస్తున్నారు.



## చీరకే అందాన్ని తెచ్చిన మీనాక్షి

టాలీవుడ్ లో గ్లామర్ తో పాటు సింప్లిసిటీ కి ప్రాధాన్యం ఇస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మీనాక్షి చౌదరి. తాజాగా ఆమె షేర్ చేసిన చీరలో ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ సారీలో ఆమె వయ్యారాలు అభిమానులను ముగ్ధులను చేస్తున్నాయి. ప్రతి ఫోటోలోనూ ఆమె కళ్ళల్లో కనిపించే ఆకర్షణ, హావభావాలు నెటిజన్ల మనసులను కట్టిపడేస్తున్నాయి. మీనాక్షి ధరించిన ఈ డార్క్ గ్రీన్ చీర గోల్డెన్ ఫ్లోరల్ ప్రింట్ తో మరింత అందంగా కనిపిస్తోంది. చీరకే మ్యాచ్ గా ఉన్న బ్రౌన్ బ్లౌజ్ ఆమె లుక్కు పూర్తిగా ఎలివేట్ చేస్తోంది. సింపుల్ హెయిర్ స్టైల్, సున్నితమైన మేకప్ తో ఆమె సౌందర్యం మరింత హైలైట్ అవుతోంది. గ్రీన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె ఫోటోషూట్ సింపుల్‌గా ఉంటూనే అద్భుతంగా ఆకట్టుకుంటోంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com